# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి: 12 సంచిక: 227 ఆదివారం 22-03-2026 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


"ఆ సీన్ అదిరింది రణవీర్"..






# నేడు నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం



- ప్రారంభోత్సవం చేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఏర్పాట్లపై మంత్రులు తుమ్మల, పొన్నం సమీక్ష
- రైతు మహోత్సవాలకు భారీగా తరలి రావాలని పిలుపు
- ఉత్తర తెలంగాణకు ఈ కేంద్రం కీలకం

**సిద్దిపేట, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నేపథ్యంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ అధికారులతో కలిసి ఏర్పాట్లను శనివారం పర్యవేక్షించారు. ముందుగా హెలిప్యాడ్‌ను పరిశీలించి భద్రతపై పోలీసులకు సూచనలు చేసిన మంత్రులు అనంతరం ఫ్యాక్టరీ ప్రాంగణానికి వెళ్లి ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన 150 స్టాళ్లను సందర్శించి ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలను పరిశీలించారు. అలాగే ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన జరిగే ప్రదేశాన్ని కూడా పరిశీలించారు. చివరగా సభా స్థలిలో జరుగుతున్న ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆయిల్ పామ్ అభివృద్ధి కోసం మిగతా 2వ పేజీలో..





# శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్‌ది

## బీఆర్ఎస్ కట్టిన భవనాలకు రిబ్బన్ కటింగ్
## సిద్దిపేట అభివృద్ధిపై రాజకీయ కక్ష
## రూ.1070 కోట్ల అభివృద్ధి పనుల రద్దు
## ఏమి చెప్పుకోడానికి ఇక్కడికి వస్తున్నారు..
## సీఎం రేవంత్‌ను నిలదీసిన ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:** సగం పనులు జరిగిన సిద్దిపేట వెటర్నరీ కాలేజీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు ఎత్తుకుపోయారు.. ఇది ముఖ్యమంత్రికి తగిన పనేనా అని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీష్‌రావు ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో తన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు.కేసీఆర్ తెచ్చిన కాళేశ్వరం జలాలతోనే నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తున్నారు.. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి రైతులకు ధోకా చేశారు అని విమర్శించారు. సిద్దిపేటలో 52 శాతం అంటే 22,819 మంది రైతులకు రుణ మాఫీ రూ.300 కోట్ల బకాయిలున్నాయని, సీఎం పర్యటించనున్న నర్మెట్టలోనే రుణ మాఫీ కాని రైతులు 350 మంది ఉన్నారని తెలిపారు. ఎగ్గొట్టిన మూడు మిగతా 3వ పేజీలో..

# సర్పంచ్‌ల అభిప్రాయాలకు ప్రాధాన్యం



## 16 అంశాలపై వివరాల సేకరణ
తాగునీటి సరఫరాపై సర్పంచ్‌ల సంతృప్తి

ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి

అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మిగతా 2వ పేజీలో..

# జీవన్ రెడ్డి తో మంత్రుల మంతనాలు




మాజీ మంత్రితో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి చర్చలు

పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి

అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత

భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి



# ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 21:** రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గిపోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మిగతా 2వ పేజీలో..




# ట్రంప్ వెనకడుగు...

- యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం
- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

# ఆరు గ్యారంటీల అమలుకు ప్రైవేటు బిల్లు




ప్రవేశపెట్టనున్న బీఆర్ఎస్

బిల్లును అనుమతించాలని స్పీకర్, మండలి చైర్మన్‌ను కోరతాం

స్పష్టం చేసిన బీఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:** ఆరు గ్యారంటీల పేర్లు చెప్పి రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ తెలిపింది. అధికారంలోకి వచ్చిన తొలి రోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల అమలు ఫైలుపై సంతకం చేశారని, వారం తర్వాత అప్పటి రాష్ట్ర గవర్నర్‌తో అసెంబ్లీ ఉభయ సభల సమావేశంలో చెప్పించారని మిగతా 2వ పేజీలో..

# రాష్ట్రంలో రంజాన్ సందడి

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద ఏర్పాట్లు

**హైదరాబాద్, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:** దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే రాష్ట్రంలోనూ వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ముస్లింలు వివిధ ఈద్గాల వద్ద ప్రార్థనలు మిగతా 2వ పేజీలో..






# యుఎన్ఐ కార్యాలయం స్వాధీనం

- జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

# నేడు నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం





**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఆయిల్ పామ్ అభివృద్ధికి తాను స్వయంగా రైతుగా ఫ్యాక్టరీ నిర్మాణానికి పూర్తి కార్యదీక్ష చేపట్టారని, స్వయంగా చాలాసార్లు ఫ్యాక్టరీ పరిశీలించారని, గుజరాత్‌లో పాలకు కురియన్ మాదిరి ఆయిల్ పామ్‌కి మంత్రి తుమ్మల అని కొనియాడారు. ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని, వర్షాల ప్రభావం తక్కువగా ఉండటంతోపాటు కోతుల బెడద కూడా ఉండదని తెలిపారు. ఉత్తర తెలంగాణలో సాగు చేసిన రైతులకు ఈ ఫ్యాక్టరీ ప్రధాన కేంద్రంగా మారుతుందని చెప్పారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

నా మొదటి సంతకం ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీపైనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో కీలకం కానుందని, సుమారు రూ.300 కోట్లతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ తక్కువ సమయంలో పూర్తయిందని తెలిపారు. గంటకు 30 నుండి 120 టన్నుల వరకు క్రషింగ్ సామర్థ్యం కలిగిన ఈ కర్మాగారాన్ని ఆధునిక సదుపాయాలతో నిర్మించినట్లు చెప్పారు. నాలుగైదేళ్లుగా 30 జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు వచ్చారని, ప్రైవేట్ కంపెనీలు ముందుకొచ్చాయని తెలిపారు. తాను వ్యవసాయ శాఖ మంత్రి అయిన తర్వాత ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి మొదటి సంతకం చేశానని, 32 ఎకరాల్లో ఈ ఫ్యాక్టరీ ఏర్పడిందని, 16 నెలల్లోనే పూర్తి చేసిన దేశంలోనే మొదటి ఫ్యాక్టరీ ఇది అని చెప్పారు. గతంలో పండించిన పంటలను దూరప్రాంతం అశ్వారావుపేట తరలించాల్సి వచ్చేదని, ఇప్పుడు సిద్దిపేటలోనే ప్రాసెసింగ్ జరుగుతుందని తెలిపారు. వ్యర్థాల ద్వారా 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెప్పారు. రైతులు విక్రయించిన మూడు రోజుల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయని, రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఆయిల్ పామ్ నూనె ప్రధానంగా ఇక్కడినుంచే ఉత్పత్తి అవుతుందని తెలిపారు. మల్లన్న సాగర్ రాకముందే ఇక్కడ మొక్కలు పెట్టారు.. ఈ ఫ్యాక్టరీ ప్రజలది.. కాళేశ్వరానికి జీవనాడి ఎల్లంపల్లి.. ఎక్కడినుండి ఎక్కడికి నీళ్లు తరలించాలన్నా ఎల్లంపల్లి కీలకం.. ఎల్లంపల్లి నిర్మించింది కాంగ్రెస్ పార్టీ.. ఎల్లంపల్లి నుండి నీళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం తెస్తే స్విచ్ వేరే ప్రభుత్వం వాళ్ళు నొక్కారు అని బీఆర్ఎస్‌నుద్దేశించి అన్నారు. 'నా స్థానంలో ఎవరున్నా ఇక్కడ ఫ్యాక్టరీ వచ్చేది.. ఇక్కడైతేనే ప్రజలకు ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రితో చెప్పి నిధులు మంజూరు చేయించా.. తాను వచ్చిన తరువాత ఐదు ఫ్యాక్టరీలు సంతకం చేసిన.. ముందుగా పూర్తి చేసింది నర్మెట.. ఈ ఫ్యాక్టరీ ఆయిల్ పామ్ రెమ్యునరేషన్ నుండి కట్టాం' అని మంత్రి తుమ్మల చెప్పారు. పదేళ్లల్లో మీరు చేసిన రుణ మాఫీ కరెక్ట్ అయితే మీకు ఈ గతి పట్టి ఉండేది కాదని బీఆర్ఎస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాలుగు దఫాలుగా డబ్బులు వేయడం వల్ల రైతుపై రుణ భారం పడిందన్నారు. 'మేము అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు ఉన్న 25 లక్షల మంది రైతులకు ఒకేసారి రుణ మాఫీ చేశాం.. 25 లక్షల మంది పేర్లు శాసనసభలో పెట్టాం.. దేశంలో మొదటిసారి రూ.21,671 కోట్లు ఒకేసారి రుణ మాఫీ చేసిన చరిత్ర దేశంలో తెలంగాణది ఒక్కటే. సాంకేతిక సమస్యతో రుణ మాఫీ కాని వారికి మహబూబ్‌నగర్ సభ వేదికగా మళ్ళీ రూ.3 వేల కోట్లు ఇచ్చాం.. తరువాత ఏ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని నమ్మలేదు.. రెండేళ్లల్లో రేవంత్ రెడ్డి ఏం చేశారో ప్రజలు ఇచ్చిన తీర్పే నిదర్శనం' అన్నారు. కోహెడ మొక్కజొన్న రైతులు అడగగానే కొనుగోలు కేంద్రాలు తెరిచాం.. కానీ తమ వల్లే తెరిచారని మీరు ప్రకటించుకున్నారు.. ఎప్పటికీ అబద్ధాలు ఆడడమేనా అని మంత్రి నిలదీశారు. దేశంలో తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లు రైతుల ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. మీరు ఇచ్చిన హామీలు ఎన్ని పూర్తి చేశారు.. దళితులకు మూడెకరాలు ఏమైంది.. దళిత బంధు ఏమైంది అని ప్రశ్నించారు. కాళేశ్వరంపై ఇచ్చంపల్లి, దుమ్మగూడెంపై అనాటి కేబినెట్‌లోనే చెప్పా.. మీ అవినీతి కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారు అని ఆరోపించారు. ఎన్నికల ముందు మంజూరు చేసిన పథకాలను ఎక్కడా ఆపలేదని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా రిఫైనరీకి శంకుస్థాపన జరుగుతుందని, రైతాంగ మహోత్సవాలకు రైతులు భారీగా హాజరుకావాలని మంత్రులు పిలుపునిచ్చారు.




## ఆరు గ్యారంటీల అమలుకు ప్రైవేటు బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

తెలిపింది. 800 రోజులైనా 6 గ్యారంటీల అమలుకు అతీగతీలేదని, అందుకే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నామని ఆ పార్టీ ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ సమావేశాల్లోనే ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెడతామని, అసెంబ్లీ స్పీకర్ కార్యాలయాన్ని, మండలి చైర్మన్ కార్యాలయాన్ని కలిసి బిల్లును అనుమతించాలని కోరుతామని తెలిపారు. 6 గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లును సభలో అనుమతించాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. గతంలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రభుత్వం ఆమోదించి ప్రజల పట్ల చిత్తశుద్ధిని చాటుకుందని గుర్తు చేసింది. ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రభుత్వాలు ఆమోదించే సంప్రదాయం రాష్ట్రంలో ఉంది కాబట్టి ఈ ఆరు గ్యారంటీల అమలు కోసం తమ పార్టీ పెడుతున్న ప్రైవేటు మెంబర్ బిల్లును కాంగ్రెస్ పార్టీ ఆమోదించాలని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. పాలక పక్షం, ప్రతిపక్షం రెండు కోరుతున్నాయి కాబట్టి ఈ బిల్లు ఆమోదం సులభంగా జరుగుతుందని తెలిపింది. రైతులు, మహిళలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు ఇలా ప్రతి ఒక్క వర్గం తరపున ఈ బిల్లును ప్రతిపాదిస్తున్నామని తెలిపింది. ఈ బిల్లు చట్టం అయితే రైతన్నలకు రైతుబంధు ఎగగొట్టడానికి ప్రభుత్వానికి వీలుండదని, ముఖ్యమంత్రి ఖచ్చితంగా రైతుబంధు సహా ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాల్సి వస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. ఈ ప్రైవేట్ బిల్లు చట్టం అయితే ప్రభుత్వ ఎగవేతలకు కళ్లెం వేస్తుంది.. ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ఖచ్చితంగా లబ్ధి చేకూరేందుకు వీలవుతుంది.. ఈ చట్టం వల్ల అన్నదాతలకు, ఆటో అన్నలకు, మహిళలకు, విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ లబ్ధి కలుగుతుంది.. అని వివరించారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత అన్ని పార్టీల నేతలను కలిసి మద్దతు ఇవ్వాలని కోరుతామని, అవసరమైతే లేఖలు రాస్తామని తెలిపింది. పార్టీలకతీతంగా ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఈ బిల్లు అమలు కోసం స్థానిక ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేయాలని కోరింది. బిల్లుకు సంబంధించి ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని బీఆర్ఎస్ పార్టీ తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి మాట తప్పి 800 రోజులైన నేపథ్యంలోనే తామే స్వతహాగా ఈ బిల్లు తీసుకువస్తున్నామని బీఆరఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. ఒకవేళ ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ శాసనసభలో అనుమతించకుంటే చట్టపరంగా ఉన్న ఇతర మార్గాలను కూడా ఉపయోగించుకుంటామన్నారు.

## ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి**

విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయమని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని ఆయన గుర్తు చేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. ఈ విషయాన్ని మొదట 16వ తేదీన అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని, అనంతరం బ్జడెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని గుర్తు చేశారు. ఈ ఉద్యోగాల తగ్గుదలకు



కృత్రిమ మేధస్సు కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## సర్పంచ్‌ల అభిప్రాయాలకు ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**



మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్ఇన్‌చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ నిర్వహించారు. పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్రదింపులు జరిపి మొత్తం 12,728 గ్రామ పంచాయతీలలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పంపుల పనితీరు, ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్లు, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన తదితర 16 కీలక అంశాలపై వివరాలు సేకరించారు. దీనిపై మంత్రి సీతక్క శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్ ల అభిప్రాయ సేకరణ వివరాలను తెలుసుకున్నారు. ఈ అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచ్‌లు తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామస్థాయిలో సర్పంచ్‌ల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా మిషన్ భగీరథ సేవలను మరింత మెరుగుపరుస్తాం. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం తమ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. సర్పంచ్‌లు గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ వ్యవస్థ లేని మారుమూల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వర్షాకాలానికి ముందే చెక్‌డ్యాంలు నిర్మించాలని సూచించారు. స్థానిక నీటి వనరులను బలోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుందన్నారు. తాగునీటి సమస్యలపై ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ 1916కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నట్లే ఈ వేసవిలో కూడా మిషన్ భగీరథ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాపై వచ్చే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి పరిష్కరించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

## రాష్ట్రంలో రంజాన్ సందడి

**మొదటిపేజీ తరువాయి**



చేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న పిన్నా, పెద్దా తరతమ భేదాలు లేకుండా ఒకరినొకరు అలాయ్ బలాయ్ ఇచ్చుకున్నారు. హిందువులు కూడా తమ ముస్లిం మిత్రులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. చరిత్రాత్మక మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్`ఉల్`ఫితర్ ప్రార్థనలు చేశారు. పాత బస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాలో కూడా పెద్ద సంఖ్యలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఆ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారత దేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకున్నారు.



## యుఎన్ఐ కార్యాలయం స్వాధీనం

- **జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు**
- **హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం**

**న్యూఢిల్లీ, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ :**

దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా(యూఎన్ఐ) వార్తా ఏజెన్సీ కార్యాలయాన్ని శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ కార్యాలయంపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను బయటకు పంపించేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూ కేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి. కానీ యూఎనఐ ఆ పని చేయలేదని హైకోర్టు వెల్లడించింది.

## ట్రంప్ వెనకడుగు...

- **యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం**
- **ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం**
- **సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం**
- **ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్**
- **ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత**

**వాషింగ్టన్, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ :**



పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆయిల్, గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో యుద్ధం ఆగాలని ప్రపంచం అంతా కోరుకుంటోంది. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై తమ లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. తమ సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారు చేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం అని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈమేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

జర్నలిస్ట్ డైరీ
ఆదివారం 22-03-2026
POLITICAL & GENERAL
JOURNALIST DAIRY


# గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

- ప్రమాదంలో చనిపోయాడన్న పోలీసులు
- హత్య చేశారంటూ స్థానికుల ఆందోళన
- జాతీయ రహదారి దిగ్బంధనం...ఉద్రిక్తత



**లక్నో, మార్చి21, జర్నలిస్ట్ డైరీ:**
ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శనివారంనాడు తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతిని ఖండిస్తూ స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గోవుల స్మగ్లింగ్‌ను అనుమానించి ఒక ట్రక్కును వెంబడిస్తుండగా అది ఆయన బైకును ఢీకొట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఫర్సా వాలే బాబాగా పేరున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో కోసి కలాన్ ఏరియాలో జాతీయ రహదారిని గో సంరక్షకులు దిగ్బంధించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ`ఆగ్రా రహదారిపై ఆందోళనలు చోటు చేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడకు చేరుకున్న పోలీసులు, వారి వాహనాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారుల్ని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే నిరసకారులు తిరగబడడంతో.. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు .ఘటనపై మథుర ఎసఎస్పీ మాట్లాడుతూ, గోవులను స్మగ్లింగ్ చేస్తున్నారనే అనుమానంతో కంటైనర్ ట్రక్కును బాబా అడ్డుకున్నారని, దట్టమైన మంచు కారణంగా ఆయన బైక్‌ను ట్రక్కు ఢీకొందని తెలిపారు. ట్రక్కులో వైర్లు, రేషన్ సరుకులు ఉన్నాయని, డ్రైవర్, హెల్పర్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. గోవుల స్మగ్లింగ్‌తో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదని, రోడ్డు ప్రమాదంగానే కనిపిస్తోందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఫార్సా వాలే బాబా మృతికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'నేరస్థుల ప్రమేయం ఏమాత్రం ఉన్నా క్షమించి విడిచిపెట్టేది లేదు' అని సీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

# మియాపూర్‌లో దారుణ ఘటన

- తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి
- కోపంతో యువతిపై కత్తితో దాడి

**హైదరాబాద్,మార్చి21, జర్నలిస్ట్ డైరీ:**
మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. మె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు

- కుళ్లిన గుడ్లతో ఎగ్‌ఫఫ్స్ తయారీ
- పాతపబస్తీ కుల్సుంపురాలో అధికారుల దాడి

**హైదరాబాద్,మార్చి21, జర్నలిస్ట్ డైరీ:**
హైదరాబాద్‌లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈఈంఅధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్‌స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేషన్ సర్వేలేన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫఎసఎసఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్‌ది

మొదటిపేజీ తరువాయి

సీజన్ల రైతుబంధును తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో రద్దు చేసిన రూ.1070 కోట్ల పనులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీఎంకు ఇప్పటికే బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో ఈ నియోజకవర్గానికి కొత్తగా మంజూరైన కార్యక్రమం ఒక్కటీ లేదన్నారు. రేవంత్ సిద్దిపేటలో ప్రారంభించబోతున్న కార్యక్రమాలన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసి, నిధులు కేటాయించి, నిర్మాణాలు పూర్తి చేసినవేనని స్పష్టం చేశారు. తమదేమో శ్రమ ఫలితం.. రేవంత్ రెడ్డిదేమో శిలాఫలకం ఆవిష్కరణా అని ఆవేదన వ్యక్తం చేశారు. శిలాఫలకాల మీద నీ పేరు ఉండొచ్చు రేవంత్ రెడ్డి గారూ.. కానీ, సిద్దిపేట ప్రజల మనోఫలకాల మీద ఉండేది మాత్రం కేసీఆర్ పేరే అని అన్నారు. రూ.300 కోట్లతో నర్మెట్టలో ప్రారంభించబోతున్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్ ప్రభుత్వ ఘనతేనని, దేశంలోనే అత్యుత్తమ టెక్నాలజీతో ఫ్యాక్టరీ రావడానికి, రిఫైనరీ పెట్టడానికి తామే నిర్ణయం తీసుకున్నామని, టీజీఐసీ ద్వారా 62 ఎకరాల భూమిని సేకరించి ఇచ్చామని, రైతులను ఒప్పించి





మొక్కలు నాటించామని ఆయన వివరించారు. నాడు కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని ఎగతాళి చేసిన రేవంత్ అదే కాళేశ్వరం జలాలతో నడిచే ఫ్యాక్టరీని ఇవాళ ప్రారంభించనుండడం శోచనీయమన్నారు. ఈ ఫ్యాక్టరీ కోసం కాల్వ పొడిగించి 20 కోట్ల లీటర్ల సామర్థ్యం గల చెరువును నిర్మించి నీరందించింది తామేనన్నారు. పక్కనే పారుతున్న కాళేశ్వరం కాల్వ నీళ్లను నెత్తిన జల్లుకుని ఫ్యాక్టరీని ప్రారంభించు అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాళేశ్వరంమల్లన్నసాగర్ ప్రాజెక్టును అడ్డుకోవడానికి కోర్టుల్లో కేసులు వేసి ఎన్ని కుట్రలు చేసినా మొక్కవోని దీక్షతో ప్రాజెక్టును పూర్తి చేసి నీరందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రిగా నాడు తాను మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేసిన భవనాలకు ముఖ్యమంత్రి ఇవాళ రిబ్బన్ కటింగ్‌కు వస్తున్నారని ఎద్దేవా చేశారు. రూ.3.60 కోట్లతో సెంట్రల్ డ్రగ్ స్టోర్, రూ.25 కోట్లతో ఆయుష్ హాస్పిటల్, గట్ల మల్యాలలో రూ.1.40 కోట్లతో పీహెచ్‌సీ, సిద్దిపేటలో అర్బన్ పీహెచ్‌సీ భవనాలు కట్టింది తామేనన్నారు. ఎన్నికల కోడ్ వల్ల ప్రారంభానికి నోచుకోకున్నా ఇప్పటికే సేవలు అందిస్తున్నాయన్నారు. సిబ్బందిని నియమించకుండా వాటికి శిలాఫలకాలు వేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. దేవాలయాలు, విద్యాలయాలతోపాటు రూ.78 కోట్లతో 30 ఎకరాల స్థలంలో జిల్లా జైలును నిర్మించింది కూడా తామేనని చెప్పారు. అమృత్ ఫేజ్ 2 కింద కేంద్రం నుంచి సాధించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా బీఆర్ఎస్ హయాంలో మంజూరైనవేనన్నారు. 202425 ఏప్రిల్‌లో వడగండ్ల వానకు నష్టపోయిన సిద్దిపేట రైతులకు వెంటనే పంట నష్టపరిహారం, బీమా అందించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకున్నది నేనే అని చెప్పడానికి వస్తున్నారా.. రంగనాయక సాగర్ టూరిజం ప్రాజెక్ట్, కోమటి చెరువుపై శిల్పారామం, సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్, అగ్రికల్చర్ కాలేజీ, మిట్టపల్లి ఎస్సీ గురుకులం, సిద్దిపేట స్పోర్ట్స్ స్టేడియం, టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లు, సిద్దిపేటఇల్లంతకుంట, సిద్దిపేటకిష్టాపూర్ ఫోర్ లేన్ రోడ్లు, ఆడిటోరియం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను అర్ధంతరంగా ఆపేసింది నేనే అని చెప్పుకోవడానికి వస్తున్నారా అని నిలదీశారు. రాజకీయ కక్షతో రద్దు చేసిన ఈ పనులను ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తీవ్ర రూపం దాలుస్తోన్న ఇరాన్ యుద్ధం

- దాడులను తీవ్రతరం చేసిన ఇరాన్
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం



**టెహ్రాన్,మార్చి21, జర్నలిస్ట్ డైరీ:**
రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలో మీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టా□`గ్గంట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. ఇటీవల శ్రీలంకకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్`2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్`యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామాల వేళ..ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.



# గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

- 20శాతం అదనపు కమర్షియల్ గ్యాస్ సరఫరా

**న్యూఢిల్లీ, మార్చి 21, జర్నలిస్ట్ డైరీ:**
వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది.

# రుణ విముక్తి చర్యలను పట్టించుకోని బడ్జెట్

దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏం గొప్ప పనులు చేశారంటే ఏమీ లేదు. ఉన్న అప్పులకు మిత్తీలు కట్టడం, కొత్తగా అప్పులు తేవడం తప్ప, తెలంగాణను రుణం నుంచి విముక్తి చేసే ఆలోచన ఒక్కటీ కానరాలేదు. కెసిఆర్‌ను మించి అప్పులు చేస్తూ పోతే మరో వంద ఏళ్లయినా అప్పులు తీరవు. దీనిపై ఆలోచన, ప్రణాళిక లేకుండా బడ్జెట్ ప్రసంగాలు సాగుతున్నాయి. మేము ఎంచుకున్న లక్ష్యాల వైపు అడుగులు వేయడంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా, లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నాం. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగాం. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన సొమ్మును, తిరిగి వారి అభ్యున్నతి కోసమే వెచ్చిస్తున్నాం ఆర్థిక మంత్రిగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క గొప్పగా చెప్పుకున్నారు. కానీ డబ్బు ఆదా చేయడం, వృధా చేయకుండా ఉండేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఎక్కడ వృధా అవుతుందో కూడా గుర్తించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది. గ్రామాలను స్వయం సమృద్ధి దిశగా ప్రోత్సహించే ప్రయత్నం జరగడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలకు డబుల్ పెన్షన్లు, లక్షల్లో జీతాలు ఎందుకో చెప్పడం లేదు. కిలో రూపాయి బియ్యం వృధాను అరికట్టడం లేదు. పెన్షన్ల వృధాను గుర్తించడం లేదు. ఇవన్నీ కట్టడి చేస్తే కొంతయినా మిగులుబాటు ఉంటుంది. ఇకపోతే కేవలం సంక్షేమం తప్ప అభివృద్ధి జరగడం లేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నా, వాటిని పట్టించుకోవడం లేదు. వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చిన ఘనత వీరిది. వేల



ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయి, దేవాలయాలు పాడుబడ్డా పట్టింపు లేదు. ఉత్సవాలు నిర్వహించుకోవడం తప్ప దేవాదాయశాఖ మంత్రికి ఏ భూమి ఎక్కడ ఉందో లేదో తెలియదు. రోడ్లు ఎలా ఉన్నాయో రోడ్లు భవనాల శాఖ మంత్రికి తెలియదు. ప్రభుత్వమంటే పంచి పెట్టడం కాదు. ఆదాయాన్ని ఆదా చేయాలి. అప్పులు లేకుండా చేయాలి. అలా కాకుండా సంక్షేమాల పేరుతో దుబారా చేయడం వల్ల అభివృద్ధి ఆగిపోతోంది. తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం రేషన్ కార్డులు ఉన్నవారికే అని చెప్పకనే చెప్పారు. రేషన్ కార్డుల్లో బోగస్ ఎత్తివేస్తే అనేక మంది పేదలకు లబ్ది చేకూరుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది ఎవరికన్నది స్పష్టత లేదు. అన్ని కుటుంబాలకు వర్తిస్తుందా అన్నది చెప్పాలి. ఇకపోతే ఆసుపత్రులు కునారిల్లుతున్నాయి. వాటిని పటిష్టం చేయాల్సి ఉన్నా గత రెండేళ్లుగా ఎలాంటి ప్రయత్నం జరగలేదు. హాస్టళ్లునరక కూపాలుగా ఉన్నా వాటిని ఉద్దరించలేదు. ఉన్న స్కూళ్లను సంస్కరించడం లేదు. కానీ కొత్తగా అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలన్న లక్ష్యం మంచిదే. కానీ ఉన్న స్కూళ్లను బాగుచేసి, అధ్యాపకులను భర్తీ చేస్తే మంచిది. ఇకపోతే మూసీ కాలుష్యం నుంచి రాజధాని వాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పం ఆహ్వానించదగ్గదే. గత బడ్జెట్ అంచనాలకన్నా అదనంగా పెంచిన రూ.43 వేల కోట్ల బడ్జెట్ ఆదాయ అంచనాలలో ఏ పద్దు కింద ఎంత పెరుగుతుందనేది రాష్ట్ర ప్రభుత్వం ఉజ్జాయింపుగా తెలిపింది. పన్నులద్వారా రూ.14 వేల కోట్లు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లలో రూ.13 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.6,412 కోట్లు, కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కింద రూ.3,710 కోట్లు, కొత్త రుణాలు రూ.5,325 కోట్లు అదనంగా వస్తాయని ప్రభుత్వం వివరించింది. ఈ అంచనాల ప్రకారమే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు పెంచింది. కానీ ఆదాయం అదనంగా పెరుగుతుందని పెట్టుకున్న లక్ష్యాల్లో అన్నీ నెరవేరతాయా అనేది ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు వచ్చే ఏడాది అదనంగా రూ.13 వేల కోట్లు పెరుగుతాయని తెలిపింది. కానీ గత కొన్నేళ్లుగా ఈ పద్దు కింద కేంద్రం నుంచి బడ్జెట్‌లో పెట్టుకున్న అంచనా ప్రకారం నిధులు రాలేదు. కేంద్ర గ్రాంట్లుగా రూ.22,782.50 కోట్లు వస్తాయని గత బడ్జెట్‌లో అంచనా వేస్తే రూ.11,161 కోట్లే వచ్చినట్లు సవరణ పద్దు వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మొత్తం ఆదాయం ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు, పాత బాకీలపై వడ్డీలు, అసలు సొమ్ము కిస్తీల చెల్లింపులు, రెవెన్యూ ఖర్చులతో పోతున్నందున సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు కొత్తగా తీసుకునే రుణాలే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఏడాదిలో బహిరంగ మార్కెట్ నుంచి రూ.64,539 కోట్ల కొత్త రుణాలు తీసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నా రూ.67,539 కోట్లను సేకరించారు. ఇక వచ్చే ఏడాదికి బహిరంగ మార్కెట్ నుంచి రూ.73,383 కోట్లు, ఇతర మార్గాల్లో మరికొన్నికలిపి మొత్తం రూ.82,870 కోట్ల కొత్త రుణాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలతో ఆర్థిక అస్థిరత నెలకొన్న తరుణంలో అందుకు అనుగుణంగా కూడా ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఎప్పటికైనా ఉచిత పథకాలు తగ్గించుకోవడం, ఖర్చులు తగ్గించుకోవడం చేయనంత వరకు బడ్జెట్ కేటాయింపులు ఘనంగానే ఉంటాయి. ఆయరణలో దెబంతింటాయి.



# పంచాయతీల్లో పగలే వెన్నెల

- **రాత్రి పగలు వెలుగుతున్న వీధి దీపాలు**

**జర్నలిస్ట్ డైరీ, పరిగి :**

పంచాయితీలలో పట్ట పగలే వెన్నెల కనిపిస్తోంది. మారుమూల పల్లెల్లో ఎక్కడ చూసినా వీధి దీపాలు రాత్రి పగలు వెలుగుతూనే ఉన్నాయి.

సామాన్యుడు ఇంట్లో ఒక్క బల్బు ఎక్కువ సేపు వెలిగితే బిల్లు భారంతో విలవిలలాడిపోతుంటే, ప్రభుత్వ యంత్రాంగం మాత్రం ప్రజాధనాన్ని విద్యుత్ రూపంలో తగలబెడుతోంది. వృధా అవుతున్న విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపుతోంది. వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని గ్రామాల్లో వీధిదీపాలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతూనే ఉండటం అధికారుల బాధ్యతా రాహిత్యానికి పరాకాష్టగా నిలుస్తోంది పరిగి మండలంలోని రంగంపల్లి గ్రామంలో గత కొన్ని రోజులుగా వీధిదీపాలు ఆర్పే నాథుడే కరువయ్యాడు. ఉదయం ఆరు గంటలకే ఆపాల్సిన లైట్లు మధ్యాహ్నం సాయంత్రం అయినా వెలుగుతూనే ఉన్నాయి. దీనివల్ల గ్రామంలో ఓల్టేజ్ సమస్య తలెత్తి ఇళ్లలోని ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, ( పరికరాలు)పాడవుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామ సర్పంచ్

మాకు దీనికి సంబంధం లేదు.. విద్యుత్ శాఖ వారే చూసుకోవాలి, వారికి ఈ సమస్య పలుమార్లు చెప్పడం జరిగిందని గ్రామ పంచాయతీ సర్పంచ్ తప్పించుకుంటుండగా, ఆ ఆ గ్రామాలలో "స్విచ్ వేయాల్సింది, ఆపాల్సింది పంచాయతీ సిబ్బందే" విద్యుత్ ఆ గ్రామానికి సరఫరా చేయడం మాత్రమే మా బాధ్యత, అని విద్యుత్ శాఖ చెబుతోంది. ఈ ఇద్దరి మధ్య సమన్వయ లోపం చివరకు ప్రజాధనాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేస్తోంది. గ్రామాలలో పగటిపూట అనవసరంగా లైట్లు వెలుగుతున్నా పట్టించుకోని అధికారులపై అధికంగా వృధా పోతున్న విద్యు త్ ద్వారా వచ్చే భారాన్ని ప్రజలపై భారాన్ని మోపడంతో, అధికార యంత్రాంగంపై ప్రజలు మండిపడుతున్నారు,

ఒక్క రంగంపల్లి గ్రామంలోనే వీధిలైట్లు వెలగడం వల్ల నెలకు సుమారు 15000 వేల నుంచి 30 వేల రూపాయల వరకు బిల్లులు వస్తున్నాయని సంబంధిత సిబ్బంది తెలిపారు అనవసరంగా పగలు వెలిగే విద్యుత్ లైట్లను ఆర్పి వేసినట్లయితే ప్రజలపై పడే అదనపు విద్యుత్ భారం ప్రతి నెల ఆదా చేయవచ్చని తెలిపారు ఈ పరిస్థితి ఒక్క రంగంపల్లి గ్రామంలోనే కాదు . పరిగి మండలంలోని సుమారు అన్ని గ్రామ పంచాయతీల్లో ఇదే సమస్య తో అనవసరంగా ఆయా గ్రామ ప్రజలపై విద్యుత్ ద్వారా వచ్చే అదనపు భారం పడుతోంది.

అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏటా దాదాపు 30 లక్షల రూపాయల పై గానే ప్రజల పన్నుల సొమ్ము కరెంట్ బిల్లుల రూపంలో గాల్లో కలిసిపోతోంది. ఈ నిధులతో గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు,

గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు వీధిదీపాలను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. పగటిపూట లైట్లు వెలుగుతుంటే చూసి చూడనట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

జిల్లా పంచాయతీ అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు

తక్షణమే మండలంలోని అన్ని గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని,

వీధిదీపాలకు టైమర్ లేదా సెన్సార్ స్విచ్‌లను ఏర్పాటు చేసి, ఆటోమేటిక్‌గా పగటిపూట వీధి దీపాలు ఆరిపోయేలా సమన్వయంతో పనిచేసి ప్రజలపై అధిక భారం పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# పతనం అంచున నైతిక విలువలు : మానవత్వం మృగ్యం

ఆధునిక సమాజం అభివృద్ధి, సాంకేతికత, ఆర్థిక వృద్ధి అనే మూడింటి చుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తున్నా, ఈ ప్రకాశవంతమైన ముఖం వెనుక ఒక గంభీరమైన సంక్షోభం దాగి ఉంది. అది నైతిక సంక్షోభం. ఒకప్పుడు మనుషుల మధ్య సంబంధాలను, సమాజపు స్థిరత్వాన్ని నిలబెట్టిన న్యాయం, నీతి, నిజాయితీ, పరస్పర గౌరవం వంటి విలువలు ఇప్పుడు క్రమంగా బలహీనపడుతున్నాయి.



మనిషి జీవితం కేవలం చట్టాలపై ఆధారపడదు. అది విలువలపై నిలబడుతుంది. చట్టం ఒక కనీస ప్రమాణం మాత్రమే. కానీ సమాజం నిజంగా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజలలో నైతిక స్పృహ ఉండాలి. అయితే, ఈ స్పృహే ఇప్పుడు క్షీణిస్తోంది. సమాజంలో ఏది సరైనది, ఏది తప్పు అనే విషయంలో స్పష్టత తగ్గిపోవడం అత్యంత ప్రమాదకరం. మనం నైతికంగా తప్పుడు విషయాలను కూడా “సాధారణం”గా అంగీకరించే స్థితికి చేరుకుంటున్నాం.

ఇది ఏదో ఒక్కసారిగా వచ్చిన పరిణామం కాదు. రాజకీయ వ్యవస్థలో జరిగిన మార్పులు దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి. రాజకీయ నాయకత్వం ఒకప్పుడు ప్రజా సేవకు ప్రతీకగా ఉండేది. కానీ ఇప్పుడు అది అధికార పోరాటానికి, స్వార్థ ప్రయోజనాలకు కేంద్రీకృతమైంది. అధికారాన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా మారినప్పుడు, నైతికతకు చోటు తగ్గిపోతుంది. నిజం చెప్పడం, తప్పు ఒప్పుకోవడం, బాధ్యత తీసుకోవడం వంటి లక్షణాలు నాయకత్వంలో కనిపించకపోతే, సమాజం మొత్తం దానికి ప్రభావితమవుతుంది.

ఇంకొక ముఖ్యమైన అంశం...సమాజంలో పెరుగుతున్న విభజనలు. మతం, జాతి, వర్గాల ఆధారంగా మనుషులు విడిపోతున్నారు. ఈ విభజనలు కేవలం సామాజిక దూరాన్ని మాత్రమే పెంచడమే కాదు. అవి నైతిక బాధ్యతను కూడా బలహీనపరుస్తాయి. “మన వాళ్లు” “పరాయి వాళ్లు” అనే భావన పెరిగినప్పుడు, అన్యాయం కూడా సమర్థించబడుతుంది. ఒకే సంఘటనను వేర్వేరు కోణాల్లో న్యాయాన్ని పాక్షిక దృష్టి తో చూడటం ప్రారంభమవుతుంది. ఇది నైతిక ప్రమాణాల పతనానికి నిదర్శనం.

ఇక్కడ మరొక ప్రమాదకరమైన పరిణామం ఉదాసీనత. అన్యాయం పట్ల మౌనం వహించటం. ఒకప్పుడు ఎవరికైనా అన్యాయం జరిగితే ప్రజలు అయ్యో పాపం అని స్పందించేవారు, ప్రశ్నించేవారు. ఇప్పుడు మాత్రం చాలా సందర్భాల్లో మనకెందుకులే అనే నిర్లక్ష్యం కనిపిస్తోంది. మనకు నేరుగా సంబంధం లేకపోతే, అది మన సమస్య కాదని భావించడం పెరిగింది. ఈ మౌనం సమాజ హితాన్ని లోపల నుంచి చెద పురుగులా తొలి చేస్తుంది, నాగరిక సమాజం లో అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యం లేకపోవడం, దాన్ని అంగీకరించడం రెండూ సమానంగా ప్రమాదకరమే.

ఈ పరిస్థితిలో మీడియా పాత్ర కూడా ప్రశ్నార్థకమవుతోంది. ఒకప్పుడు ప్రజాస్వామ్యంలో మీడియా నిజాన్ని వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. కానీ ఇప్పుడు, కొన్నిసార్లు అది కూడా రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలకు లోబడుతోంది. నిజంకంటే కట్టు కథనాలు ఎక్కువయ్యాయి. ప్రజలు వాస్తవాన్ని కాకుండా, తమ అభిప్రాయాలకు సరిపోయే సమాచారాన్ని మాత్రమే మీడియాలో వెతుక్కొని దానిని మాత్రమే బలంగా నమ్మేస్థితి ఏర్పడుతోంది. ఇది నైతిక చర్చలను మరింత క్షీణింపజేస్తుంది.

అయితే, ఈ నైతిక సంక్షోభాన్ని కేవలం వ్యవస్థలపైనే మోపడం సరిపోదు. వ్యక్తుల పాత్ర కూడా చాలా ముఖ్యమైనది. ప్రతి వ్యక్తి తన ప్రవర్తనలో నైతికతను పాటించాలి. చిన్న చిన్న విషయాల్లోనూ నిజాయితీ, న్యాయం పాటించడం ద్వారా మాత్రమే పెద్ద మార్పు సాధ్యమవుతుంది. సమాజం అనేది వ్యక్తుల సమాహారం కాబట్టి, వ్యక్తుల మార్పే సమాజ మార్పుకు పునాది.

ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితి నుంచి బయటపడటానికి మార్గం ఏమిటి? మొదటిగా, మనం నైతిక విలువలను తిరిగి చర్చలోకి తీసుకురావాలి. విద్యా వ్యవస్థలోనూ, ప్రజా చర్చల్లోనూ నైతికతకు ప్రాధాన్యత ఇవ్వాలి. రెండవది, ప్రజలు ప్రశ్నించే స్వభావాన్ని పెంపొందించుకోవాలి. అన్యాయం జరిగినప్పుడు మౌనం కాకుండా స్పందించాలి. మూడవది, నాయకత్వంలో బాధ్యతను డిమాండ్ చేయాలి. ప్రజలు బాధ్యత వహించని నాయకత్వాన్ని అంగీకరించకూడదు.

అత్యంత ముఖ్యంగా, మనం మనలోనే ఒక నైతిక పునరుద్ధరణను ప్రారంభించాలి. సమాజం మారాలంటే, మనలో మార్పు రావాలి. ఇది ఒక రోజు జరిగే ప్రక్రియ కాదు; కానీ ప్రతి చిన్న ప్రయత్నం కూడా దిశను మార్చగలదు. నైతిక విలువలు తిరిగి బలపడితేనే సమాజం స్థిరంగా ఉంటుంది. సారాంశంగా, నైతిక ప్రపంచం కూలిపోతున్నదన్న భావన ఒక అతిశయోక్తి కాదు; అది ఒక హెచ్చరిక. మనం ఈ హెచ్చరికను గమనించకపోతే, సమాజం మరింత అస్థిరత వైపు దారితీస్తుంది. కానీ అదే సమయంలో, ఇది ఒక అవకాశమూ——మన విలువలను పునఃసమీక్షించుకోవడానికి, సమాజాన్ని మరింత న్యాయసమ్మతంగా మార్చడానికి. నైతికత అనేది ఒక ఆలోచన మాత్రమే కాదు; అది మన జీవన విధానం కావాలి. అప్పుడే మన సమాజం నిజంగా ముందుకు సాగగలదు.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడి గా ఇల్లూరి లక్ష్మయ్య

**జర్నలిస్ట్ డైరీ,కర్నూలు బ్యూరో:**

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఇల్లూరి లక్ష్మయ్య సెట్టి అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఇల్లూరు లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభ 2026 2028 సంవత్సరానికి గాను పదవిని రాయలసీమ జోన్ కు కేటాయించారు. ఇందులో భాగంగా కర్నూల్ నగరంలో ఉన్న ఆర్యవైశ్య మహాసభ రీజినల్ కార్యాలయమైన వాసవి ఆర్యవైశ్య హాస్టల్ నందు ఎన్నికల ప్రక్రియను నిన్న ఉదయం ప్రారంభించారు. ఈ ఎన్నికలకు అధికారిగా ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెనుగొండ సుబ్బరాయుడు వ్యవహరించారు. నామినేషన్ల కార్యక్రమంలో కర్నూలు నుండి ఇల్లూరు లక్ష్మయ్య, అనంతపురం జిల్లా నుండి ముడియం రమణ మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ముడియం రమణ నామినేషన్ బలపరిచిన వ్యక్తికి మహాసభలో సభ్యత్వం లేకపోవడం వల్ల సాంకేతికంగా అతని నామినేషన్ తిరస్కరణకు గురైనట్టు ఈరోజు స్క్రూటీని అనంతరం ఎన్నికల అధికారి పెనుగొండ సుబ్బరాయుడు తెలిపారు. దీంతో మిగిలిన ఏకైక అభ్యర్థి ఇల్లూరు లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టుగా ఆయన ప్రకటించారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఇల్లూరు లక్ష్మయ్యకు డిక్లరేషన్ ఫామ్ ను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో తనపై ఉంచిన బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని అన్నారు. ఆర్యవైశ్యుల పెద్దాయనగా గుర్తింపు పొందిన కొణిజేటి రోశయ్య అలంకరించినటువంటి స్థానానికి తాను ఎన్నిక కావడం మర్చిపోలేని అనుభూతి అన్నారు. పెద్దలు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ ఆశీస్సులతో రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని లక్ష్మయ్య తెలిపారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత మహాసభలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని వాటిని సరిదిద్ది, విజయవాడలో కార్యాలయం ఏర్పాటుకు నడుం బిగిస్తామని తెలిపారు. అలాగే పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సహకారంతో రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలలో ఆర్యవైశ్యుల యువతకు అవకాశాలు లభించేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా ఎన్నిక కావడానికి సహకరించిన అందరికీ ఇల్లూరు లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాశి అన్నపూర్ణ సత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, ముడియం రమణ, పోతుల సురేష్, మాజీ ఎమ్మెల్సీ పోతుల సునీత, ఇల్లూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





# ఉగాది నాడు పిడకలతో సమరం

**జర్నలిస్ట్ డైరీ, కర్నూలు బ్యూరో:**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉగాది ఉత్సవాలు వైభవంగా జరిగాయి .ఉత్సవాలలో భాగంగా శ్రీశైలం మహా క్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది .అలాగే సాంప్రదాయబద్ధంగా ఆలూరు అసెంబ్లీ పరిధిలోని ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం వైభవంగా జరిగింది. గ్రామంలోని వీరభద్ర స్వామి, కాళికా మహాదేవి ప్రణయానికి నిదర్శనంగా ఈ వేడుకలు జరిగాయి. కారుమంచి నుంచి రాజ వంశానికి చెందిన రెడ్డి గుర్రంపై వచ్చి కైరుప్పల గ్రామంలో పూజ నిర్వహించిన అనంతరం గ్రామంలో వీరభద్ర స్వామి వర్గీయులు, కాళికాదేవి వర్గీయులు ఒకరిపై ఒకరు పిడకలతో దాడి చేసుకున్నారు .
ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలించి వచ్చారు. గ్రామదేవతలు ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చి వీరభద్ర స్వామికి కాళికాదేవికి వైభవంగా సాంప్రదాయబద్ధంగా వివాహం జరిపారు .
ఇదిలా ఉండగా కర్నూల్ నగరంలోని కల్లూరు చౌడేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బురద కుంటలో గాడిదలతో ఊరేగింపు జరగడం ఇక్కడ విశేషం. అనంతరం గ్రామంలో గాడిదలను రంగులతో అలంకరించి ఊరేగించడం గత కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న సంప్రదాయం. కాగా శ్రీశైలంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నుంచే కాక పక్కనున్న తెలంగాణ రాష్ట్రం చెందిన భక్తులతో పాటు, కర్ణాటక రాష్ట్రంలోని భక్తులు కూడా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తానికి పరాభవ నామ సంవత్సరం ఉగాది ఉత్సవాలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత వైభవంగా జరిగాయి.






# భార్య మరణించిన ఐదో రోజే

- **కరీంనగర్ ఎస్ఐ ఆత్మహత్య**

**జర్నలిస్ట్ డైరీ,కరీంనగర్:**

భార్య మరణించిన ఐదో రోజే కరీంనగర్ టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు . ఐదు రోజుల క్రితం చంద్రశేఖర్ భార్య దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే, ఆమె కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుందని చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దివ్య మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఇల్లందకుంట మండలం సీతంపేటకు తరలించగా, అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దివ్య మరణానికి భర్త చంద్రశేఖరే కారణమని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు ఆయనపై దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్తులు, బంధువుల నిరసనల మధ్య మృతురాలి తల్లిదండ్రులు అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా శని వారం అయిదో రోజు సందర్భంగా,చంద్రశేఖర్ అత్త మామ ఇంటికి వెళ్లారు. కార్యక్రమం అయిపోయిన తరువాత డ్రెస్ మార్చుకుంటానని గదిలోకి వెళ్లిన చంద్రశేఖర్, ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో బంధువులకు అనుమానం కలిగింది. గది తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆయన ఉరివేసుకొని వేలాడుతూ కనిపించారు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఏప్రిల్ 4న జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ

**జర్నలిస్ట్ డైరీ,దోమ:**

వికారాబాద్ జిల్లా దోమ మండలం కిష్టాపూర్ గ్రామంలో భారత మాజీ ఉప ప్రధాని, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణకు ముహూర్తం ఖరారైంది. బహుజనుల విముక్తి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుని ఆశయాలను స్మరించుకుంటూ, వచ్చే నెల ఏప్రిల్ 4న గ్రామంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక నాయకులతో అంబేద్కర్ వాదులు, దళిత సంఘాలు మరియు అన్ని కుల సంఘాలను కలుపుకొని సమన్వయంతో ముందుకు సాగుతున్నామని . విగ్రహ ఏర్పాటు కోసం నిర్వాహకులు చందాలు సేకరిస్తూ, ఊరూరా తిరుగుతూ ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు . ఆయనతో పాటు పలువురు సామాజిక విశ్లేషకులు, మేధావులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొననున్నారు. ఏప్రిల్ 4న జరిగే ఈ విగ్రహావిష్కరణ మహోత్సవానికి బహుజన వాదులు, అంబేద్కర్ వాదులు, కుల సంఘాల నాయకులు మరియు మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కిష్టాపూర్ గ్రామ యువత, నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్


**జర్నలిస్ట్ డైరీ,సికింద్రాబాద్:**

మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా సనత్ నగర్ లోని వెల్ఫేర్ గ్రౌండ్ లో ముస్లీం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ప్రార్ధనల అనంతరం ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రార్ధనలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుండి వేలాదిమంది ముస్లీం సోదర సోదరీమణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో ప్రార్ధనలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో కుల మతాలకు అతీతంగా ముస్లీం సోదరులకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే వెంట సనత్ నగర్ డివిజన్ బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బాలరాజ్, ఫాజిల్, ఖలీల్, జమీర్, గోపిలాల్ చౌహన్, వనం శ్రీనివాస్, సమి ఉల్లా తదితరులు ఉన్నారు.



# టపాసులు పేలి లారీ దగ్ధం

**జర్నలిస్ట్ డైరీ, కొత్తూరు:**



రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తమిళనాడులోని శివకాశి నుంచి బాణసంచా లోడుతో హైదరాబాద్ వెళ్తున్న ఒక లారీ, పెంజర్ల గ్రామ శివారులో ప్రమాదానికి గురైంది. త్వరగా చేరుకోవాలనే ఉద్దేశంతో డ్రైవర్ మెయిన్ రోడ్ కాకుండా ఎలాంటి ట్రాఫిక్ లేని రూరల్ ఏరియా నుంచి లారీని నడిపాడు. ఈ క్రమంలో శంషాబాద్ కొత్తూరు మధ్య ఉన్న 132 కేవీ హైటెన్షన్ విద్యుత్తు తీగలు లారీకి తగలడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి.
ప్రమాదాన్ని గమనించని డ్రైవర్ లారీని మరికొంత దూరం ముందుకు తీసుకెళ్లగా, లోపల ఉన్న టపాసులు పేలడం ప్రారంభమైంది. పెద్ద ఎత్తున శబ్దాలు వస్తుండటంతో అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ వెంటనే లారీని నిలిపివేసి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. కానీ కొన్ని క్షణాల్లోనే మంటలు లారీ మొత్తానికి వ్యాపించాయి. టపాసులు పేలుతున్న ధాటికి సమీప గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో టపాసులు కొంత సమయం పేలుతూనే ఉండటంతో మంటలు చెలరేగి లారీ పూర్తిగా దగ్ధమైంది.

# కొండగట్టు లో బండి సంజయ్

**జర్నలిస్ట్ డైరీ,జగిత్యాల:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న ఆలయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. శనివారం నిర్వహించిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి కొండగట్టు ఆలయం ద్వారాలు మూసివేశారు. ఆ సమయంలో బండి సంజయ్ ఆలయ ముఖ ద్వారం వద్దే మొక్కు తీర్చుకుని వెనుదిరిగారు. నేడు మళ్ళీ ఆలయానికి విచ్చేసి. గర్భాలయంలో స్వామివారిని దర్శించుకుని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్‌తో పాటు కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ కీలక నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి , భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బైక్ పై సాగునీటి కాలువలు పరిశీలించిన కోమటిరెడ్డి

**జర్నలిస్ట్ డైరీ,నల్లగొండ:**

నల్గొండ జిల్లా లోని అప్పాజీపేట గ్రామంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శనివారం బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను పరిశీలించారు. మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనం నడుపుతూ సాగునీటి కాలువలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ పనులకు మంత్రి అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణవెంలంలో ప్రాజెక్టు కాలువల ద్వారా నల్గొండ నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపి ప్రతి ఎకరానికి నీరు అందిస్తా నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించడమే తన ధ్యేయమని తెలిపారు. పిల్లకాలువ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.





# ఉల్చాల లో బండ లాగుడు పోటీలు

**జర్నలిస్ట్ డైరీ, కర్నూలు బ్యూరో:**

రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో ఆరు పళ్ళ విభాగం రాష్ట్రస్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలను కేడీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి , కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ సాంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం ఎంతో ముఖ్యమని, ఇలాంటి పోటీలు రైతుల ఐక్యతను మరియు సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. రాజవర్ధన్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తానని అన్నారు ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ, రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్న కమిటి వారిని అభినందించారు. అందరు గెలపోటములను పక్కన పెట్టి ఈ పోటీలను చూసి ఆనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తులకు వడ్డించిన చంద్రబాబు

- **స్వామి వారి సన్నిధిలో దేవాన్ష్ జన్మదిన వేడుకలు**

**జర్నలిస్ట్ డైరీ, తిరుమల:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తన మనవడు నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన శ్రీవారికి మొక్కులు చెల్లించుకోవడానికి పర్యటన చేపట్టారు. ముఖ్యమంత్రి వెంటనే ఆయన భార్య భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ఏటా దేవాన్ష్ పుట్టిన రోజున తిరుమల స్వామిని దర్శించుకోవడం, అన్నదానానికి విరాళం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. తిరుమల పర్యటన కోసం సీఎం చంద్రబాబు శుక్రవారం సాయంత్రమే తిరుపతి చేరుకున్నారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి సాయంత్రం 6.10 గంటలకు ఎస్వీ వ్యవసాయ కళాశాల మైదానంలోని హెలిపాడ్‌కు చేరుకున్న ఆయనకు జిల్లా యంత్రాంగం, నేతలు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి ఆయన రోడ్డు మార్గంలో తిరుమలకు చేరుకున్నారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ , భువనేశ్వరి, దేవాన్ష్ హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుంచి తిరుమల కొండపైకి వెళ్లారు. శనివారం ఉదయం ఆలయ మహా ద్వారం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి టీటీడీ ఈవో రవిచంద్ర, అర్చకులు పూర్ణ కుభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వేద మంత్రోచ్చారణ నడుమ ఆయనను ఆలయ మర్యాదలతో లోపలికి ఆహ్వానించారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన సీఎం కుటుంబం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనం ముగిసిన తర్వాత రంగనాయకుల మండపంలో అర్చకులు ముఖ్యమంత్రి కుటుంబానికి వేద ఆశీర్వచనం అందించారు. అనంతరం వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం మాతృ శ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో భక్తులకు సీఎం చంద్రబాబు, భార్య భువనేశ్వరి, మనవడు దేవాన్ష్ కుమారుడు లోకేష్ స్వయంగా వడ్డించారు.






# రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ సీజ్

**జర్నలిస్ట్ డైరీ ,మొయినాబాద్:**

మొయినాబాద్ పరిధిలో జరిగిన డ్రగ్స్ పార్టీ ఉదంతం పై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను శనివారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీతో పాటు భూ అక్రమాల అంశం కూడా తెరపైకి రావడంతో విచారణ వేగవంతమైంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ నిర్మించారని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలోనే ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. చేశారు.డ్రగ్ పార్టీ జరిగిన సమయంలో ఫామ్‌హౌస్ ప్రాంగణంలో ఉన్న విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్టీకి హాజరైన వారు ఎవరు? డ్రగ్స్ ఎక్కడి నుండి సరఫరా అయ్యాయి? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.





## చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రాలకు పాలాభిషేకం

**జర్నలిస్ట్ డైరీ, తాండూరు:**

శనివారం వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో ఉగాది పండుగను పురస్కరించుకుని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రాలకు పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సిములు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా కూడా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం, అలాగే ఆసరా పెన్షన్‌ను 6 వేల వరకు పెంచడం వంటి నిర్ణయాలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. దివ్యాంగుల పట్ల మానవత్వ దృక్పథంతో తీసుకున్న ఈ నిర్ణయాల కోసం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరియు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారి చిత్రాలకు పాలాభిషేకం చేశారు. అదేవిధంగా తెలంగాణలో మాత్రం అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు కొన్ని హామీలు ఇచ్చి తరువాత వాటిలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కూడా దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్‌కు చెందిన సీనియర్ నాయకులు చందు, గజేలప్ప, రాజాసింగ్, నర్సిములు, మొగుళప్పతో పాటు వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

## సమోసా తయారీ కేంద్రం పై పోలీసుల దాడి

**జర్నలిస్ట్ డైరీ,చార్మినార్:**



పాత బస్తీ జియాగూడ ప్రాంతంలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో సాగుతున్న సమోసాల తయారీని పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ , టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. కుల్సుంపురా పోలీసులతో కలిసి నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, జియాగూడ లోని ఒక ప్రాంగణంపై దాడి చేశారు. 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. చట్టబద్ధమైన నిబంధనలను తుంగలో తొక్కి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. దాడి సమయంలో బయటపడిన నిజాలు షాకింగ్‌కు గురిచేశాయి. నిందితుడు సమోసాల తయారీ కోసం కుళ్ళిపోయిన ఉడికించిన గుడ్లు, నాణ్యత లేని కూరగాయలను ఉపయోగిస్తున్నాడు. ఇప్పటికే వాడిన వంట నూనెను పదేపదే మరిగించి వాడుతున్నట్లు తేలింది. దాదాపు 5 లక్షల విలువైన కల్తీ ఆహార పదార్థాలు, మైదా, స్వీట్ కార్న్ తయారీ యంత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఆహార కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## పిల్లుల కోసం ప్రాణాలు తీసుకున్నారు

**జర్నలిస్ట్ డైరీ,సికింద్రాబాద్:**

పెంపుడు పిల్లుల మీద ఉన్న అమితమైన ఇష్టంతో ఇద్దరు ఉన్నత చదువులు చదువుతున్న యువతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు .

ఇందులో ఒకరు ప్రాణాలు కాపాడాల్సిన వైద్య విద్యార్థిని కాగా మరొకరు ఉజ్వల భవిష్యత్తు ఉన్న డిగ్రీ విద్యార్థిని. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు, ఆశయాలు ఉండాల్సిన వయసులో, ఒక చిన్న మనస్తాపం వారి జీవితాలను అర్ధాంతరంగా ముగించేసింది. పెంపుడు జంతువులపై ఉండే ప్రేమ ప్రాణాలు తీసుకునే స్థాయికి వెళ్లడం సమాజానికి ఒక హెచ్చరికగా మారింది.

మొదటి ఘటన అల్వాల్‌కు చెందిన శ్రేష్ఠ అనే యువతి జీవితంలో జరిగింది. మెడిసిన్ చదువుతున్న ఆమెకు పెంపుడు జంతువులంటే ప్రాణం. అయితే ఆమె ఇంటికి తీసుకువచ్చిన పిల్లి పిల్లను ఇంట్లోకి తీసుకురావద్దని తల్లి వారించింది. శుభ్రత లేదా ఇతర కారణాలతో తల్లి చెప్పిన ఆ చిన్న మాట శ్రేష్ఠను తీవ్రంగా గాయపరిచింది. తల్లిదండ్రులు తన ఇష్టాన్ని గౌరవించలేదని భావించిన ఆమె, క్షణికావేశంలో తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఒక డాక్టరై పదిమంది ప్రాణాలు కాపాడాల్సిన చేతులు, ఇలా తన ప్రాణాన్ని తానే తీసుకోవడం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది.మరోవైపు ఈ తరహా రెండవ ఘటన మీర్‌పేట్‌లో వెలుగుచూసింది. ఇక్కడ హిమబిందు అనే యువతి తన పెంపుడు పిల్లిని ప్రాణప్రదంగా చూసుకునేది. అయితే, ఆ పిల్లి అనారోగ్యంతో చనిపోవడంతో ఆమె తట్టుకోలేకపోయింది. రోజువారీ జీవితంలో తనకు తోడుగా ఉన్న ఆ మూగజీవి ఇక లేదనే నిజాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. ఆ పిల్లి లేని లోకంలో తాను ఒంటరిగా ఉండలేనని భావించి, తీవ్ర మానసిక వేదనతో తనువు చాలించింది.

# జీవన్ రెడ్డి తో మంత్రుల మంతనాలు

**జర్నలిస్ట్ డైరీ ,జగిత్యాల :**



కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌ల భేటీ ముగిసింది. పార్టీ పెద్దల తీరుపై గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి.. కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి.. బీఆర్ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో జీవన్ రెడ్డిని కలిసిన మంత్రులు.. ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. చాలా సమయం జీవన్ రెడ్డితో చర్చలు జరిపిన మంత్రులు.. పార్టీలో ఆయనకు సముచిత ప్రాధాన్యం దక్కేలా అధిష్ఠానం చూసుకుంటుందని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే, వీరి బుజ్జగింపులు సఫలీకృతం అయినట్లుగా కనిపించడం లేదు. జీవన్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. పార్టీ మారే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని జీవన్ రెడ్డిని కోరామని మంత్రి తెలిపారు. జీవన్ రెడ్డికి పార్టీ అండగా నిలబడే ఆలోచన చేస్తుందన్నారు. ఆయనతో చర్చించిన అంశాలను పార్టీ, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. జగిత్యాల ప్రాంతానికి జీవన్ రెడ్డి పెద్దదిక్కు అని.. అభివృద్ధి కోసమే 10 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. జీవన్ రెడ్డి గురించి తెలంగాణ రాష్ట్రంలో తెలియని వారు ఎవరూ ఉండరన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల గొంతుకగా ఉన్న నాయకుడు జీవన్ రెడ్డి అని అన్నారు. జీవన్ రెడ్డి బాధపడితే తాము బాధపడినట్లేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులు మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు జీవన్ రెడ్డితో గతంలోమాట్లాడారని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను జీవన్ రెడ్డి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి చెప్పారు పార్టీ పెద్దలు అనుసరిస్తున్న వైఖరిపై మంత్రుల వద్ద జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఇన్ని అవమానాలు ఎదుర్కొంటూ పార్టీలో ఇంకా ఎందుకు కొనసాగాలని మంత్రులను ప్రశ్నించారు జీవన్ రెడ్డి. పార్టీలో గౌరవం లేనప్పుడు ఎందుకు ఉండాలని నిలదీశారు. దీంతో మీ సమస్యకు పరిష్కారం ఏంటని జీవన్ రెడ్డిని ప్రశ్నించారు మంత్రులు. స్పందించిన జీవన్ రెడ్డి.. పార్టీ ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలను పక్కన పెట్టడమే తన సమస్యకు పరిష్కారమని మంత్రులకు తేల్చి చెప్పారు. ఇన్ని అవమానాలు భరిస్తూ పార్టీలో ఎందుకు ఉండాలని అడుగుతున్న తన కుమారులకు ఏం సమాధానం చెప్పాలని మంత్రులను అడిగిన జీవన్ రెడ్డి.. సారీ చెప్పి సమావేశాన్ని ముగించేశారు.

## ఆత్మహత్యకు ప్రేరేపించిన నిందితుడి అరెస్ట్

**జర్నలిస్టు డైరీ,సికింద్రాబాద్:**



చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఒక యువతి ఆత్మహత్య ఘటనకు సంబంధించి, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 17వ తేదీన ఉదయం సుమారు 9గంటలకు పద్మారావు నగర్‌లోని శ్రీనివాస్ నగర్ నివాసి కోటేశ్వర రావు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె జి. జనిమ్మ (19) తమ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రాథమిక ఆధారాల మేరకు కేసు నమోదు చేశారు. ముషీరాబాద్, రామ్ నగర్ నివాసి పి. గోవిందు కుమారుడైన పి. జగదీష్ (22) ఈ కేసులో ప్రధాన నిందితుడు. పోలీసుల దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం.. నిందితుడు జగదీష్ మరియు మృతురాలు గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ నిరంతరం మొబైల్ ఫోన్లు మరియు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా సంభాషించుకునేవారు. అయితే, గత కొంతకాలంగా జగదీష్ మృతురాలి ప్రవర్తనపై అనుమానం పెంచుకుని, ఆమె ఇతర వ్యక్తులతో మాట్లాడుతోందని తరచూ గొడవపడేవాడు.

ఈ క్రమంలో జగదీష్ ఆమెను మానసికంగా వేధించడమే కాకుండా, అసభ్య పదజాలంతో దూషిస్తూ అవమానించేవాడు. వారిద్దరి వ్యక్తిగత విషయాలను ఆమె కుటుంబ సభ్యులకు చెబుతానని బెదిరింపులకు పాల్పడేవాడు. నిందితుడు మార్చి 14న స్వయంగా ఆత్మహత్యాయత్నం చేసి, 16వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా మృతురాలిని వేధించడం కొనసాగించాడు. మార్చి 17వ తేదీ ఉదయం 8గంటల ప్రాంతంలో నిందితుడు మృతురాలి ఇంటికి వెళ్లి ఆమెతో తీవ్రంగా వాగ్వాదానికి దిగాడు. యువతి తీవ్ర మనస్తాపానికి గురైనప్పటికీ, అతను అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఆత్మహత్యకు కొద్ది నిమిషాల ముందు, మృతురాలు ఫ్యాన్‌కు కట్టిన చున్నీ ఫోటోను నిందితుడి స్నేహితుడైన శ్యామ్‌కు పంపింది. శ్యామ్ వెంటనే ఆ విషయాన్ని నిందితుడికి, ఇతరులకు తెలియజేశాడు. కానీ, అంతలోనే ఉదయం 8:20 గంటల సమయంలో యువతి ఉరివేసుకుని ప్రాణాలు విడిచింది.

**ఆధారాలు మరియు అరెస్ట్:**

మృతురాలు, నిందితుడి మధ్య జరిగిన ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ వివరాలు వేధింపులకు బలమైన సాక్ష్యాలుగా లభించాయి. నిందితుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు అందులోని డేటాను భద్రపరిచారు. ఈ రోజు (20.03.2026) ఉదయం 11:45 గంటలకు నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ వి. రామకృష్ణ మరియు వారి బృందం ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు.

## క్షిపణి దాడిలో మహబూబాబాద్ వాసి మృతి

**జర్నలిస్ట్ డైరీ,మహబూబాబాద్:**



తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకు చెందిన రవిగోపాల్ అనే యువకుడు సౌదీ అరేబియాలో జరిగిన క్షిపణి దాడిలో మరణించినట్లు భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. మార్చి 18వ తేదీ రాత్రి ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను సౌదీ రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేసినప్పటికీ, వాటి శకలాలు రవిగోపాల్ పనిచేస్తున్న ఆయిల్ రిఫైనరీ సమీపంలో పడటంతో ఈ ప్రమాదం సంభవించింది.

రాజధాని రియాద్‌లోని కీలక లక్ష్యాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. వీటిని గగనతలంలోనే అడ్డుకున్నప్పటికీ, కూలిపోయిన క్షిపణి ముక్కలు కింద ఉన్న రిఫైనరీ ప్రాంతంలో పడ్డాయి. ఆ సమయంలో విధుల్లో ఉన్న రవిగోపాల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ యుద్ధ వాతావరణం కారణంగా ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఆరుకు చేరుకోవడం గమనార్హం. ప్రస్తుతం అక్కడ నివసిస్తున్న భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ అధికారి అసీమ్ మహాజన్ సూచించారు.

రవిగోపాల్ మృతి వార్త మహబూబాబాద్ జిల్లాలోని ఆయన స్వగ్రామంలో పెను విషాదాన్ని నింపింది. మరణించడానికి కొద్ది నిమిషాల ముందే ఆయన తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. రవికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఇంటికి ఆధారమైన వ్యక్తి దూరం కావడంతో ఆ కుటుంబం అనాథగా మారింది. రవి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తీసుకురావాలని ప్రభుత్వం తమకు ఆర్థికంగా అండగా నిలవాలని ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా వేడుకుంటున్నారు.



## మియాపూర్‌లో మహిళపై కత్తితో దాడి

**జర్నలిస్ట్ డైరీ, మియాపూర్:**

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఒక యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే, కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది.

ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు.

తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# శ్రమ మాది.. శిలాఫలకం నీదా

- **ముఖ్యమంత్రి కి హరీష్ రావు సూటి ప్రశ్న**

**జర్నలిస్ట్ డైరీ,సిద్దిపేట:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్దిపేట పర్యటన గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్లు కత్తిరించ డానికేనని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేట లో శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, సిద్దిపేట అభివృద్ధిపై ముఖ్యమంత్రికి ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. శ్రమ మాది.. శిలాఫలకం రేవంత్ రెడ్డిది అంటూ ఎద్దేవా చేసిన హరీశ్ రావు, శిలాఫలకాలపై రేవంత్ పేరు ఉండొచ్చు కానీ, సిద్దిపేట ప్రజల మనోఫలకాలపై కేసీఆర్ పేరే ఉంటుందని స్పష్టం చేశారు. నర్మెట్టలో ప్రారంభించబోయే 300 కోట్ల ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నుండి ఆయుష్ ఆస్పత్రి, జిల్లా జైలు వరకు అన్నీ గత ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి పూర్తి చేసినవేనని ఆయన గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరం అని ఎగతాళి చేసిన రేవంత్ రెడ్డి, ఇవాళ అదే కాళేశ్వరం జలాలతో నడిచే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏ ముఖం పెట్టుకుని ప్రారంభిస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేసి, కాళేశ్వరం కాలువను పొడిగించి నీరందించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి ప్రారంభించబోతున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్, ఆయుష్ ఆస్పత్రి, పీహెచ్‌సీ భవనాలు అన్నీ తాను ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించినవేనని, సిబ్బందిని నియమించకుండానే కేవలం ప్రచారం కోసం శిలాఫలకాలు వేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రైతు రుణమాఫీ అంశంపై ముఖ్యమంత్రిని హరీశ్ రావు నిలదీశారు. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, రుణమాఫీ పేరుతో రైతులను వంచించారని ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గంలో 52 శాతం మందికి ఇంకా రుణమాఫీ కాలేదని, సీఎం పర్యటిస్తున్న నర్మెట్ట గ్రామంలోనే 350 మంది రైతులు దీని కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. వరుసగా మూడు సీజన్ల రైతుబంధు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన 1070 కోట్ల విలువైన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ముఖ్యంగా సిద్దిపేటలో పనులు మొదలైన వెటర్నరీ కాలేజీని ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు తరలించుకుపోవడం ఆయన స్థాయికి తగదని విమర్శించారు. రంగనాయక సాగర్ టూరిజం, శిల్పారామం, ఫోర్ లేన్ రోడ్లు వంటి ఆగిపోయిన పనులను వెంటనే పునరుద్ధరించాలని హరీశ్ రావు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# స్వీట్స్ అధికంగా తింటున్నారా.. ఈ విషయాలు తెలుసుకోండి..!

స్వీట్స్ అంటే ఎవరికి నచ్చవు. చిన్నప్పుడు అయితే స్వీట్స్ కనిపిస్తే చాలు వాటిని రుచి చూసే వరకు నిద్రకూడా పట్టదు. స్వీట్స్ అంటే ప్రతి ఒక్కరికి నోరూరుతుంది. కానీ ఆతర్వాతే మనల్ని ఉసూరుమనిపిస్తాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. కొందరికి మాత్రం వీటిని తినకుండా రోజు గడవదు. అలాంటి వారికి వైద్య నిపుణుల తీవ్ర హెచ్చరికలు చేస్తున్నారు. స్వీట్స్ ప్రతి రోజూ తూచా తప్పకుండా తింటుంటే.. అంతే తూచా తప్పకుండా తిన్న స్వీట్స్‌కు రెట్టించిన వ్యాయామం చేయాలని చెప్తున్నారు. అలా చేయకపోతే అది మన ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. స్వీట్ ఐటమ్స్‌లో చాలా వరకు మైదా, చక్కెర అధికంగా ఉంటాయి. ఇవి అధికంగా తినడం వల్ల, ప్రతి రోజూ తినడం వల్ల గ్లూకోజ్ అంతా కూడా శరీరంలో గ్లైకోజెన్‌గా నిల్వ అవుతుంది. అలా కాకుండా ఉండాలంటే స్వీట్స్ అధికంగా తిన్న తర్వాత నీరు తప్పకుండా తాగాలని నిపుణులు చెప్తున్నారు. అయితే ఎంత చేసినా.. ఏం చేసినా ప్రతి రోజూ స్వీట్స్ తూచా తప్పకుండా తినడం మన ఆరోగ్యంపై దుష్ప్రభావమే చూపుతుందని, కాబట్టి రోజూ స్వీట్స్ తినే అలవాటును క్రమంగా తగ్గించుకోవడం మంచిదని సూచిస్తున్నారు. ఆర్టిఫీషియల్ స్వీట్స్‌ను అధికంగా తినడం వల్ల శక్తి కోల్పోయే అవకాశం ఉందని, ఫలితంగా అలసట, నీరసం, బద్ధకం, ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయని చెప్తున్నారు. స్వీట్స్ తిన్న (Eat Sweets) తర్వాత భోజనం చేస్తే కొవ్వు పెరిగిపోతుందని, రోగనిరోధక శక్తిపై ప్రభావం అధికంగా ఉండి బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుందని అంటున్నారు. పంచదార, పంచదార ఉత్పత్తులు ప్రతి రోజూ తినడం వల్ల డిప్రెసివ్‌గా అనిపిస్తుందని, స్వీట్స్ తినడం మనకు ఒత్తిడి నుంచి తాత్కాలిక ఉపశమనం కల్పించినా దీని ప్రభావం ఆరోగ్యం దీర్ఘకాలికంగా తీవ్రంగా ఉంటుందని, కాబట్టి వీలైనంత వరకు స్వీట్స్‌ను అధికంగా తినడం మానుకోవాలని సూచిస్తున్నారు.





# వేసవిలో వచ్చే వ్యాధులివే

వేసవి వచ్చేసింది. ఇప్పుడు కాదు.. ఫిబ్రవరి నెలలోనే భానుడు భగభగ మనడం షురూ చేశాడు. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌ను దాటేస్తోంది. ఈ ఏడాది వేసవిలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలను దాటినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం నిపుణులు చెప్తున్నారు. అంతేకాకుండా ఈ ఏడాది అత్యంత ఉష్ణమైన సంవత్సరంగా నిలుస్తుందని కూడా అంటున్నారు. అయితే పెరగనున్న వేడి వల్లే అనేక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పెరుగుతున్న వేడి, వీస్తున్న వడగాలుల నేపథ్యంలో మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సురక్షితంగా ఉంచుకోవడానికి మీరు కొన్ని నియమాలను పాటించాలి. ఈ వేడిలో అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. కానీ మీరు వెళ్లినట్లయితే మీతో గొడుగు, వాటర్ బాటిల్ ఉంచడం తప్పనిసరి. ఇలాంటి పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న వృద్ధులు, పిల్లలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవి తాపంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ అల్లాడిపోతున్నారు. వేసవిలో మిమ్మల్ని మీరు ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోండి. ఆరోగ్యంగా ఉండటానికి తగినంత నీరు త్రాగాలి. వేసవిలో వచ్చే ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం..

**వడదెబ్బ:**
చాలా మందికి తీవ్రమైన వేడిలో హీట్ స్ట్రోక్ వస్తుంది. అటువంటి పరిస్థితిలో క్యాన్డ్ వాటర్, సొరకాయ, బొప్పాయి రసాన్ని పలుచగా చేసి తాగాలి. పుచ్చకాయలాంటి పండ్లు తినాలి. ఇది శరీరంలో నీటిని ఎక్కువ ఉంచుతుంది. అలాగే హీట్ స్ట్రోక్ విషయంలో ప్రభావితమైన వ్యక్తిని త్వరగా చల్లని ప్రదేశానికి తరలించండి. కళ్ళు, ముఖం, మెడకు నీటిని రాయండి. నీరు తాగాలి పరిస్థితి మెరుగుపడకపోతే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించండి.

**యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్:**
వేసవి ఎండలో మన శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ చాలా సాధారణం. ఈ సమస్యలో ఆమ్ల లేదా పుల్లని పండ్లు తక్కువగా తినాలి. మీరు దాల్చిన చెక్క, వెల్లుల్లి, తేనె వంటి యాంటీ బాక్టీరియల్ ఆహారాన్ని తినవచ్చు. ఇది పరిష్కరిస్తుంది. అలాగే చాలా బాగా పనిచేస్తుంది.

**కడుపు సమస్య:**
వేసవిలో దాదాపు ప్రతి ఒక్కరికి కడుపు నొప్పి లేదా అజీర్ణం ఉంటుంది. ఎందుకంటే చాలా మంది వీధిలో బహిరంగ వాతావరణంలో చేసిన చెరుకు రసం, నిమ్మరసం, బెల్ సిరప్, కలబంద రసం, పంచదార పండ్ల రసం వంటివి తీసుకుంటారు. ఇది టైఫాయిడ్, హెపటైటిస్, డయేరియా, విరేచనాలు, అజీర్ణం వంటి ఇతర సమస్యలను కలిగిస్తుంది. నీరు, పుల్లటి పెరుగు, యాపిల్, పచ్చి అరటిపండు, బొప్పాయి, అల్లం, జీలకర్ర, తులసి టీ, ఓట్స్, తేనె, రెడ్ ఫుడ్ ఏదైనా కడుపు సమస్యకు బాగా పనిచేస్తాయి. అంతేకాకుండా దోసకాయలాంటి మొదలైన కడుపు సమస్యలకు చాలా మేలు చేస్తాయి. అలాగే వేసవిలో ఆహారం తరచుగా పాడైపోతుంది, ఇది ఫుడ్ పాయిజనింగ్‌కు దారితీస్తుంది. కుళ్లిన ఆహారం, స్ట్రీట్ ఫుడ్ తినకపోవడమే మంచిది.

**ఎలక్ట్రోలైట్ అసమతుల్యత:**
వేడి వాతావరణంలో చెమటతో సోడియం, పొటాషియం, క్లోరైడ్ వంటి అనేక ముఖ్యమైన ఖనిజాలు పోతాయి. ఫలితంగా మన శరీరంలో అనేక సమస్యలు తలెత్తుతాయి. క్యాన్డ్ వాటర్, అరటిపండు, పచ్చి మామిడి, లిచీ, నిమ్మకాయ సిరప్, పండ్ల రసం మొదలైనవి దాని లోపాన్ని పూరించడానికి సహాయపడతాయి.

**జలుబు, దగ్గు:**
అధిక వేడి లేదా సీజన్ మారడం వల్ల చాలా మంది జలుబు, దగ్గు, గొంతునొప్పి బారిన పడుతున్నారు. విటమిన్ సి అధికంగా ఉండే పుల్లని పండ్లు, నారింజ, పైనాపిల్స్, జామ, క్యాప్సికమ్ వంటి కూరగాయలను తినడం వల్ల ఇది సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. అలాగే వేడి సూప్, గ్రీన్ టీ, తులసి టీ, అల్లం టీ లేదా ఏదైనా హెర్బల్ టీ జలుబు, దగ్గు, గొంతు నొప్పిని నయం చేయడంలో ప్రభావవంతంగా ఉంటాయి.

**చర్మ సమస్యలు:**
ఇది కూడా సాధారణ వేడి సమస్య. చర్మం సూర్యరశ్మికి, చర్మ కణాలను దెబ్బతీసే హానికరమైన అతినీలలోహిత కిరణాలకు ఎక్కువగా బహిర్గతం అయినప్పుడు సన్ బర్న్ సంభవిస్తుంది. సూర్యరశ్మి కూడా ముఖం, చేతులు, కాళ్ళపై బాధాకరమైన దద్దుర్లు కలిగిస్తుంది. వడదెబ్బ వల్ల ఎరుపు, పొక్కులు, చర్మ సమస్యలు వస్తాయి. దీనిని నివారించడానికి, నీరు తాగండి. చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోండి. ఇంటి నుండి బయటకు వెళ్లేటప్పుడు సన్‌స్క్రీన్‌ని అప్లై చేయండి. వీలైతే బహిర్గతమైన చర్మాన్ని కవర్ చేయండి. ఎండలో ఆరుబయట గడిపే సమయాన్ని కూడా తక్కువ చేయండి. ఈ వేసవిలో అదనపు మసాలాలు, నూనె, వేయించిన, ఓపెన్ స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని నిపుణులు అంటున్నారు. అలాగే కొవ్వు పదార్థాలు, మాంసం మొదలైన వాటికి దూరంగా ఉండాలి.

# చేదు కాకరకాయతో కమ్మని ఆరోగ్యం..



కాకరకాయ అంటే అందరికీ ముందుగా గుర్తొచ్చేది నోరు పాడు చేసే చేదు. ఆ చేదును తల్చుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కానీ చాలా మందికి కాకరకాయ చాలా ఫేవరేట్ ఫుడ్ కూడా. కాకరకాయతో ఏం చేసినా వాళ్లు ఒక పట్టు పట్టేస్తారు. అదే విధంగా చాలా మంది కాకరకాయ పేరు ఎత్తితేనే చికాకు పడతారు. అదెవరైనా తింటారా అనేస్తారు. కాకరకాయ కూర అంటే ఆ పూట భోజనమే వద్దనే వాళ్లనే వారు దాదాపు ప్రతి ఇంట్లో ఉంటారు. కాకరకాయ అంటే ఆమడ దూరం వెళ్లే వారి సంఖ్య అధికంగానే ఉందని వైద్య నిపుణులు చెప్తున్నారు. కాగా కొందరు కాకరకాయ వంటకాలను భలే ఇష్టంగా తింటారు. అయితే దీనిని ప్రతి ఒక్కరూ తినాలని వైద్యులు సూచిస్తున్నారు. కాకరకాయ ఉండటానికి చేదుగా ఉన్నప్పటికీ దీంతో కమ్మని ఆరోగ్యం మన సొంతమవుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నిజం చెప్తే దీని చేదు రుచే మన ఆరోగ్యానికి తియ్యని ఫలితాలు ఇస్తుందని అంటున్నారు. ఆనేక ఆరోగ్య సమస్యలను చెక్‌లో ఉంచడమే కాకుండా మరెన్నో వ్యాధులు రాకుండా అడ్డుకోవడంలో కూడా కాకరకాయ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. వారంలో రెండు సార్లయినా కాకరకాయను తినడం వల్ల మనం చాలా ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇంతకీ ఆ ఆరోగ్య ప్రయోజనాలేంటో ఒకసారి చూద్దామా..

**అధిక బరువు:**
బరువు తగ్గాలనుకునే వారికి కాకరకాయ మంచి ఆప్షన్ అని వైద్యులు అంటున్నారు. ఇందులో పోషకాలు అధికంగా ఉండి, కేలరీలు స్వల్పంగా ఉంటాయి. దీని వల్ల బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది చాలా మేలు చేస్తుంది. ఇందులో అధికంగా ఉండే ఫైబర్.. ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉండేలా చేస్తూ బరువు తగ్గడానికి దోహపడుతుంది.

**జీర్ణవ్యవస్థ:**
కాకరకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ మన జీర్ణవ్యవస్థను మెరుగు పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాకరకయల్లోని ఫైబర్ శాతం.. పేగు ఆరోగ్యాన్ని రక్షించడమే కాకుండా మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.


**గుండె భద్రం:**
కాకరకాయ తినడం వల్ల మన గుండె పదిలంగా ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం వంటి సమ్మేళనాలు గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ ఖనిజాలు రక్తపోటును నియంత్రించడంలో కూడా ఎంతో సహాయపడతాయి. వారంలో రెండు మూడు సార్లు కాకరకాయ తినడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించొచ్చని వైద్యులు అంటున్నారు.

**డయాబెటిక్స్:**
షుగర్ వ్యాధితో ఇబ్బంది పడేవారికి కాకరకాయ దివ్యౌషధంలా పనిచేస్తుంది. వీటిలో ఉండే పాలీపెప్టైడ్‌పీ అనే ఇన్సులిన్ లాంటి సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల షుగర్ వ్యాధిగ్రస్తులకు కాకరకాయ చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

**విటమిన్లు:**
కాకరకాయల్లో మన శరీరానికి కాలావాల్సిన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. కాకరకాయల్లో విటమిన్‌సీ అధికంగా ఉంటుంది. వీటిలో ఉండే యాంటీ యాక్సిడెంట్లు.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడానికి సహాయపడుతుందని వైద్యులు వివరిస్తున్నారు. అంతేకాకుండా కాకరకాయలు రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా ప్రదాన పాత్ర పోషిస్తాయి.

# "ఆ సీన్ అదిరింది రణవీర్".. ధురందర్ 2పై జక్కన్న రియాక్షన్..

ప్రస్తుతం భారత చలన చిత్ర పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుడు ఎస్ఎస్.రాజమౌళి 'ఆర్ఆర్ఆర్', 'బాహుబలి' వంటి గొప్ప చిత్రాలను తెరకెక్కించి ప్రపంచ వ్యాప్తంగా తెలుగోడి సత్తా ఎంతో చూపించాడు. ఈ రోజు ప్రపంచం నలు మూలల ఉన్న ప్రతి ఒక్కరూ రాజమౌళి అంటే గుర్తుపట్టే విధంగా క్రేజ్ సంపాదించుకున్నాడు. అయితే.. తాజాగా రాజమౌళి "ధురంధర్ ది రివెంజ్" సినిమాపై తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆదిత్య ధర్ సీక్వెల్ అయిన ధురందర్ 2ను ప్రశంసిస్తూ.. ఆర్. మాధవన్, రణవీర్ సింగ్‌ల నటనను అభినందించారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. "నాకు ధురందర్ 1 చాలా నచ్చింది. కానీ 'ది రివెంజ్' స్కేల్, ఎమోషన్ పరంగా అంతకు మించి పోయింది. రచన, నటీనటుల ఎంపిక, సాంకేతిక నైపుణ్యం, సంగీతం, దర్శకత్వం అన్నీ అద్భుతంగా ఉన్నాయి. కానీ, ఇందులోని భావోద్వేగభరితమైన అంశాలే ఈ సినిమాకు అసలైన బలాన్ని ఇచ్చాయి. డైరెక్టర్ ఆదిత్య ధర్ అదరగొట్టారు. 4 గంటల నిడివి ఉన్న సినిమాను తీసి విడుదల చేయడానికి చాలా ధైర్యం కావాలి. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులు చివరి వరకు సీట్లకు అతుక్కుపోతారు. రణవీర్ అద్భుతంగా నటించావు. షెడ్డులో సోదరితో ఉన్న సన్నివేశం అదిరిపోయింది. ఆ ప్రారంభం నుంచి గుండెను పిండేసే క్లైమాక్స్ వరకు, హమ్జా, జస్కిరత్‌గా మీరిద్దరూ మమ్మల్ని మంత్రముగ్ధులను చేశారు. నటుడుమాధవన్ గండి, మీరు ఒక దేశం నిస్సహాయతను, నిరాశను ఎంత అద్భుతంగా ప్రదర్శించారంటే.. మీ విజయాన్ని మా విజయంగా భావించాం.. ఈ ఘన విజయం సాధించిన చిత్ర బృందానికి అభినందనలు."అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇక రాజమౌళి రియాక్షన్‌పై ధురంధర్ డైరెక్టర్ ఆదిత్య ధర్ స్పందించారు. రాజమౌళికి కృతజ్ఞతలు తెలిపారు. మీ వంటి గొప్ప దర్శకుడి నుంచి ఇలాంటి ప్రశంసలు రావడం ఆశీర్వాదంగా, అదే సమయంలో బాధ్యతగా భావిస్తున్నానని ఆదిత్య ధర్ పేర్కొన్నారు. దర్శకులుగా మీ వంటి వారు సృష్టించిన అద్భుతమైన సినిమా ప్రపంచాలను చూస్తూనే తాము పెరిగామని, ఇప్పుడు తమ సినిమా మిమ్మల్ని అంతగా మెప్పించడం వ్యక్తిగతంగా ఎంతో సంతోషాన్ని ఇస్తోందని రాశారు. కేవలం నిజాయితీతో కూడిన కథను చెప్పడమే కాకుండా, భారతీయ సినిమా స్థాయిని (Scale), ఆత్మను (Soul) ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే ప్రయత్నం చేశామని వివరించారు.





## నితిన్ మళ్లీ గాడిలో పడేనా?



టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆయ' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షూటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని `లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.



## పెళ్లి కంటే అదే బెటర్.. హీరోయిన్ షాకింగ్ స్టేట్‌మెంట్!

సినీ తారల వ్యక్తిగత జీవితాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఎప్పుడూ ఉంటుంది, ముఖ్యంగా పెళ్లి, ప్రేమ వంటి విషయాల్లో హీరోయిన్ల అభిప్రాయాలు తరచుగా వైరల్ అవుతుంటాయి. తాజాగా మలయాళ ముద్దుగుమ్మ, సౌత్ స్టార్ హీరోయిన్ ఐశ్వర్య లక్ష్మి వివాహ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. తన 34 ఏళ్ల జీవిత ప్రయాణంలో తాను చూసిన పెళ్లిళ్ల గురించి ఐశ్వర్య చాలా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. "నేను ఇప్పటివరకూ చూసిన వైవాహిక జీవితాల్లో నిజమైన సంతోషంతో ఉన్న జంటలు చాలా తక్కువ. పెళ్లి తర్వాత భాగస్వాముల మధ్య వచ్చే విభేదాలు, ఒత్తిడి వారి కెరీర్‌పై కూడా ప్రభావం చూపుతాయని నేను గమనించాను," అని ఆమె పేర్కొన్నారు.

చాలామంది పెళ్లి చేసుకున్న తర్వాత తమ వృత్తిపరమైన ఎదుగుదలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, లక్ష్యాలను చేరుకోవడంలో వెనకబడిపోతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు, ఈ క్రమంలోనే పెళ్లి అనేది జీవితానికి తప్పనిసరి అనే పాత ఆలోచనా ధోరణిని ఆమె పక్కన పెట్టేశారు. పెళ్లి చేసుకోకపోతే జీవితం పరిపూర్ణం కాదు అనే మాటను ఆమె అంగీకరించడం లేదు. అయితే, ఐశ్వర్య లక్ష్మి ప్రేమకు లేదా బంధాలకు వ్యతిరేకం కాదు. "నాకు బంధాల మీద నమ్మకం ఉంది. ఇద్దరు వ్యక్తుల మధ్య మనసులు కలిసినప్పుడు, ఒకరినొకరు అర్థం చేసుకున్నప్పుడు.. ఆ బంధాన్ని కొనసాగించడానికి 'పెళ్లి' అనే ముద్ర అవసరం లేదని నా భావన. అందుకే నేను లైవ్-ఇన్ రిలేషన్‌షిప్ వైపు మొగ్గు చూపుతున్నాను," అని స్పష్టం చేశారు. సమాజం ఏమనుకుంటుందో అనే భయం లేకుండా, తన మనసులోని మాటను ధైర్యంగా చెప్పిన ఐశ్వర్య లక్ష్మిపై మిశ్రమ స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆమె బోల్డ్ స్టేట్‌మెంట్‌ను సమర్థిస్తుంటే, మరికొందరు సంప్రదాయ వివాహ వ్యవస్థ గొప్పతనాన్ని గుర్తు చేస్తున్నారు.



## భర్త సినిమాకు రాని దీపిక..

బాలీవుడ్ స్టార్ కపుల్ రణవీర్ సింగ్, దీపికా పదుకొణె మధ్య ఏదో జరుగుతోందా? గత కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ చూస్తుంటే అవుననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రణవీర్ సింగ్ నటించిన లేటెస్ట్ సెన్సేషన్ 'ధురంధర్ 2: ద రివెంజ్' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నా, దీపికా పదుకొణె మాత్రం సైలెంట్‌గా ఉండటం ఇప్పుడు పెను వివాదానికి దారితీసింది. రణవీర్ సింగ్ కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ స్క్రీనింగ్‌కు దీపిక హాజరుకాకపోవడం గమనార్హం. అయితే, ఆ మరుసటి రోజే ఆమె తన అత్తమామలతో కలిసి ముంబైలో ఒక ప్రైవేట్ కాన్సెర్ట్‌లో కనిపించడం నెటిజన్లను ఆశ్చర్యపరిచింది. "సొంత భర్త సినిమా ఫంక్షన్‌కు రాని దీపిక, మరుసటి రోజే బయట ఈవెంట్లలో ఎలా కనిపిస్తుంది? అసలు వీరి మధ్య అంతా సవ్యంగానే ఉందా?" అంటూ నెటిజన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. సాధారణంగా రణవీర్ సినిమా వస్తుందంటే దీపిక సోషల్ మీడియాలో తెగ హంగామా చేస్తుంది. 2025 డిసెంబర్‌లో 'ధురంధర్' మొదటి భాగం విడుదలైనప్పుడు ఆమె భర్త నటనను ఆకాశానికెత్తుతూ వరుస పోస్టులు పెట్టింది. కానీ, పార్ట్ 2 విడుదలై మూడు రోజులు గడుస్తున్నా, ఆమె నుండి కనీసం ఒక చిన్న స్టోరీ కూడా రాకపోవడంపై అభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. "గాజా ఇష్యూ లేదా జేఎన్‌యూ (JNU) వివాదాల మీద పెద్ద పెద్ద పేరాగ్రాఫ్లు రాసే దీపికకు, తన భర్త సినిమా విజయాన్ని అభినందించడానికి టైం లేదా?" అంటూ కొందరు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఈ సినిమా దర్శకుడు ఆదిత్య ధర్ గతంలో దీపిక వర్కింగ్ అవర్స్ గురించి చేసిన కామెంట్స్ ఆమెకు నచ్చలేదని, అందుకే ఆమె ఈ సినిమాకు దూరంగా ఉంటుందని ఒక టాక్. ఒకవేళ రణవీర్ సినిమాను ఓపెన్‌గా సపోర్ట్ చేస్తే, భవిష్యత్తులో ఖాన్'ల సినిమాల్లో తనకు అవకాశాలు తగ్గుతాయని దీపిక భయపడుతోందనే వింత వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

## పెళ్లిపీటలు ఎక్కిన పునర్నవి

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగు పెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్ ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు. ప్రైవేట్‌గా జరిగిన ఈ వేడుకకు కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ప్రస్తుతం ఈ జంటకు సోషల్ మీడియాలో అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నపునర్నవి ఇప్పుడు తన వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇక భవిష్యత్తులో ఆమె మళ్లీ సినిమాల్లోకి వస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.



Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465